

# నిమగ్న

సారస్వత వ్యాసాలు, నోట్స్

డా॥ మైథిలి అబ్బరాజు

# నిమగ్న

## సారస్వత వ్యాసాలు, నోట్స్

డాక్టర్ మైథిలి అబ్బరాజు

చినుకు పబ్లికేషన్స్
గాంధీనగర్ విజయవాడ - 520 003

# మైథిలి సాహిత్యానుభూతుల అక్షర స్పర్శ

## - జలంధర

**'ముందుమాట'** మీరే రాయాలి అని మైథిలి అడిగినప్పుడు దాని వెనకాల అభిమానం ప్రేమతో పాటు ఒక కంపల్షన్ ఉన్నదని నాకు తెలుసు... అదే కంపల్షన్ ఈ అక్షరాల ముత్యాలజల్లుగా జాలువారుతోంది అంటే... దీని వెనకాల ఇద్దరికీ ప్రేరణలో ఏదో కామన్ కమిట్‌మెంట్ ఉందనిపించింది... అందుకే ఒప్పుకున్నాను.

ఇది మైథిలి అక్షరగవాక్షం...మనం తొంగిచూసే ముందు...ఈ డాక్టర్ అమ్మాయిలో 'లో'ని అక్షరపు వెలుగు గ్రహించి, ప్రేరణ ఇచ్చి రాయించిన అఫ్సర్ మహమ్మద్ గారికి, వాకిలి సంపాదకులు రవీందర్ వీరెల్లి గారికి, కల్పనా రెంటాల గారికి మనమంతా థ్యాంక్స్ చెప్పుకోవాలి... కారణం ఎవరు ఏది ఎలా రాయగలరో తెలిసి తెలియచెప్పి రాయించగల శక్తి ఉన్న సాహితీ మూర్తులైన ఎడిటర్స్ చాలా తక్కువ మంది... వారికి అభివందనమని చెప్పందే ఈ అక్షరాలనడకకు అడుగుజాడలు ఉండవు.

(నా 'జలంధర కథలు' అందుకే నా ఎడిటర్స్‌కు అంకితం చేశాను... ఈ కృతజ్ఞత కంపల్షన్, ఇన్స్పిరేషన్ కూడా).

ఇంక ఈ అక్షరగవాక్షం నుంచి తొంగి చూద్దామా?! దీన్ని ఎలా ఎప్పుడు చూడాలో అన్నది విషయసూచిక మైథిలి కలమే...

### సహృదయ ప్రమాణం... సంస్మరణీయ శోభ – శాకుంతలం

శాకుంతలంలో 'వనజ్యోత్స్న' (అడవికాచిన వెన్నెల) అన్న పదం ఉపయోగిస్తారు కాళిదాసు...అసలు వెన్నెల కాయవలసింది అడవిలోనేనా?! భావుకత అక్షరరూపం దాల్చేముందు విశ్వసాహిత్యంగా ఎవరూ గుర్తించక ముందే...వనజ్యోత్స్నగా దహరాకాశంలో శరత్‌జ్యోత్స్నగా మౌనంగా...ధారగా, మెరుపులా...చల్లగా...విరబూయాలి... అప్పుడు కానీ, పర – పశ్యంతి – 'అక్షరమాధ్యమాన్ని' ఉపయోగించుకుని తృప్తిని,

శాంతిని, కాంతిని వెదజల్లవు. ఆ అక్షరాల జిలుగే వేరు... వాటి ఎరుకే వేరు.. అవి ఎలా ఉంటాయో ఈ పుస్తకం చదివితే అర్థమౌతుంది.

ఈ విశ్లేషణలో...ఎవరు ఏ ఆత్మీయతను కోల్పోయినా, ఆ స్థానాన్ని భర్తీ చేస్తాను... పవిత్రమైన, ధర్మబద్ధమైన ఎటువంటి బాంధవ్యాన్ని అయినా స్వయంగా వారితో నెరుపుతాను...ప్రేమించడం అంటే ఏమిటో, పోగొట్టుకోవడం ఎలా ఉంటుందో తెలిసిన తరువాత కలిగే కారుణ్యం ఇది...ఇటువంటి హీరో గురించి కాళిదాసు అలా చెప్పక, ఇంక ఎలా చెప్తాడు?! అనిపిస్తుంది...తరచిన కొద్దీ ఒక్కొక్క పదమూ ఒక తలుపు తెరుస్తుంది...ఈ పుస్తకం పేజీలు తిప్పుతూ ఉంటే భావోత్సవపు గులాబీ సౌరభం...

**కాళిదాసు మహాకవి భరతవాక్యంలో...**

జ్ఞానం కలిగిన కవుల వాక్కులకు గౌరవం లభించాలి...నీల లోహితుడైన పరమేశ్వరుడు...నాకు పునర్జన్మ లేకుండా చెయ్యాలి...అంటారు...

"ఈ పుస్తకం చదివినా, విన్నా ఇదే తృప్తి" – అంటారు మైథిలి.

కాళిదాసు కవిత్వం గురించి కాంచీపురపు మధురకవి దండి ప్రస్తావన, మల్లినాథ సూరి సంస్మరణ... చదివి తీరాలి.

**ఉత్తర సీతా చరితం – హృదయాహ్లాదిని కుందమాల**

రామాయణం ఉత్తరాకాండలో అభిజ్ఞ సీత తల్లి ఒడిలోకి రాముడి పిలుపును, ఆర్తిని కాదని వెళ్లిపోవడం, కర్తవ్యం, బాధ, అవమానం పొందిన స్త్రీ ఆఖరి ప్రస్థానంలో తెగింపు బాధే ఇది...

అందుకే అది ఆమోదకరమైన ఆనందపు కలయికగా భవభూతిని మించి దిఙ్నాగుడు 'రాత' మార్చివేస్తాడు...అక్షర బ్రహ్మను అనిపిస్తాడు. ఆయన కరుణామృత వర్షం సీత కన్నీటిని, రాముడి నేరాన్ని (నేరమే అది.. మహా ప్రేమికుడు, ఆరాధకుడు, సీతావ్రతుడు అయిన రాముడు...ఆమెను త్యజించి ప్రేమభావన పట్ల అపరాధి అయ్యాడుగా) వాల్మీకి రాసి ఉండడు అనిపించే ఉత్తరరామచరిత్రను అద్భుత నాటకంగా రాసి దాని అపప్రథ పోగొట్టాడు...

"ఉత్తర రామచరిత్ర ధర్మానికే అవమానం – నా కల్పవృక్షంలో దానికి స్థానం లేదు..." అన్నారు విశ్వనాథ సత్యనారాయణగారు.

ఆ బాధ తీర్చడం దిఙ్నాగుడు ఏనాడో చేశాడు...

"అనురాగం మానసస్థం... వెలుపలి కర్కశత్వం కనిపించిపోతుంది– లోపల ఆర్ద్రత ఉన్నదయ్యా...నా ప్రేమభావనలు తామరతూడులోని దారాలంత సూక్ష్మమైనవి... సుకుమారమైనవి–పూజ్యమైనవి" అంటాడు రాముడు తన మిత్రుడితో...

ఇట్లా అనురాగాన్ని తెలియపరచగల ఆ మర్యాదపురుషుడిని మర్చిపోలేని సీత.

అతని దోషం అల్పమైనట్లు, ఆ దూరం మరొక నెయ్యపు కినుకగా సంభావించి గౌరవిస్తుంది...

"సాహసికుడా... అందుకే కదా నాకు (నా జ్ఞాపకాలకు) దూరమయ్యావు?" అనగలిగిన ఈ సీత  దిజ్ఞాగుని సీత.

(If you want to punish a person make him guilty and there by insecure. If you want to excuse a person, help him to come out of guilt...).

అందుకే మల్లెపూలమాల కుందమాల, ముకుందమాల అయ్యింది అంటారు మైథిలి.

## రససిద్ధుని ప్రస్థానం

కీట్స్...వియద్గంగ నిర్మల భావనాధారలు. దేవపారిజాతాలు పుష్పచ్ఛాయలు. మానవ కంఠాలలో పలకని శంఖనాదాలు- కన్నీటి మధుర కవిత్వాలు. జ్వరిత స్వప్నాలు. కొన్ని భ్రమలు, సాక్షాత్కారాలు ఇంద్రజాలపు గవాక్షాలలోనించి ఆ-నిషిద్ధ ఊహలు చేరరాని గంధర్వలోకాలు...

ఇప్పటికే 'కీట్స్' అర్థమైపోతాడు...

ద్వందత్వంలో నలగడం మానేసి వాటిని దాటి భారతీయ తత్వవేత్తలాగా మరేదో చూడగలిగాడు కీట్స్... అదేమిటో 'కీట్స్' కవిత్వం మొత్తం చదవఖ్ఖర్లేకుండా అనుభూతి మాత్రం ఆశీర్వచనంగా పొందాలంటే మైథిలి మైత్రీ సహాయం చేస్తుంది.

"కవిత్వం ఆకులు చిగురించినంత సహజంగా రాకపోతే అసలు రాయకపోవడమే మంచిది"

ఈ మైథిలి నిర్ణయం...ఇది గొప్ప మార్గదార్శనిక దీపజ్వాల.

వైరుధ్యాలకు కారణాలను వెతుక్కోకుండా జీవించడాన్ని ఏదో మూసలో బిగించే ప్రయత్నం చెయ్యకుండా ఉండగలగడాన్ని 'అభావసామర్థ్యం' (Negative Capability) అంటారు...ఆ సందేహం, రహస్యం చాలా విధాలుగా జీవితాన్ని ఆకర్షణీయం చేస్తాయి...కానీ ఆ సిద్ధాంతం పరమావధి అదికాదు...ప్రశ్నలతో బ్రతకడం దగ్గర మొదలై, అన్ని ప్రశ్నలూ అంతమైన చోటికి ఆ మార్గం...తత్త్వవేత్తలకు ఆఘాతం కలిగించేవాటిని, కవి ఆస్వాదించగలడు- కవి ఒక్కడే ఇక్కడ కవిత్వం కానిది... ఎప్పుడూ ఇంకొక 'ఆ' శరీరంలో జీవించే అతనికి తనది అంటూ ఏముంటుంది?!

ఇది మైథిలి విశ్లేషణ.

## జేన్ ఆస్టిన్

పంథొమ్మిదవ శతాబ్దపు తొలి సంవత్సరాల్లో 'వివాహం ఒక ఉపాధి' గా ఉన్న కాలం...'వివాహం ఒక ఉపాధి' ఆ స్థితికి పరిస్థితికి మకుటాయమానమైన అర్థం, అనౌచిత్యం రానీయని అర్థం కల్పించారు మైథిలి.

ఇది భరత భూమిలో స్త్రీకి వివాహ వ్యవస్థ అవస్థగా మార్చిన పద్ధతి.

జేన్ ఆస్టిన్ దు:ఖపడడాన్ని 'రొమాంటిసైజ్' చేయదలుచుకోలేదు...సమస్యకు

నివారణ ముందు చెబుతారు. పరిష్కారం ఇవ్వకుండా తప్పించుకోరు. నిజ జీవితంలో ఉంటాయా ఇట్లాంటి పరిష్కారాలు?! అంటే, సమాధానం ఏమిటంటే...

సాహిత్యం ఎప్పుడూ ఒక సూచన, ఒక వైద్యం, ఒక ధైర్యం. నిజ జీవితపు నేలబారుతనాన్ని నిరాశను మాత్రమే చెప్పి ఊరుకోవటాన్ని జేన్ ఆస్టిన్ ఇష్టపడి వుండరు అంటారు మైథిలి.

పరిమితమైన పరిధిలో ఆమె కనబరచింది అపరిమితమైన ప్రజ్ఞ.

## రక్షణను రచించిన భద్రమహిళ అగాథాక్రిస్టీ

జనముద్దు సాహిత్యాన్ని రచించారు ఈమె. "రచయిత సంస్కారం, అధ్యయనం, వ్యక్తీకరించే శక్తి మాత్రమే రచనను నిర్ణయిస్తాయి. మీడియోకర్ మనుష్యులు ఉన్నట్లే మీడియోకర్ సాహిత్యం ఉంటుంది...అయితే ఎంత మీడియోకర్ ఆశావాద, పలాయనవాద సాహిత్యం అయినా, ఎంతో గొప్ప అనిపించుకున్న నిరాశావాదపు సీరియస్ సాహిత్యం కన్నా న్యాయమైనది అని నేను నమ్ముతాను"

"మానవ హృదయంలో లాగే సమాజ మస్తిష్కంలోనూ వంద పొరలు, వేయి మెలికలు– అన్నింటినీ అప్పీల్ చేయడం ఒకే రకపు సాహిత్యం వలన కాదు"

ఇది మైథిలి విశ్లేషణ.

## రవీంద్రుడు "చిత్ర"

ఎప్పుడో చదివిన చిత్ర...జ్ఞాపకాల పొరలనుంచి చీకటిని ఛేదిస్తూ వచ్చి నిలబడింది. కళ్లముందుగా వెలుగుతూ...మరొకసారి అక్షర మాదకతలో మునిగి... సుస్నాతులమై నిద్రలేచామన్న ఏదో భావన

స్వప్న ప్రపంచాల సౌందర్య దీపం 'చిత్ర'.

చిత్ర మణిపురపు రాజకుమారి... అతడు?! అర్జునుడు...1892 లో రవీంద్రులు రాసిన ఈ నాటిక ప్రపంచంలో ఎక్కడో ఒకచోట ఇప్పటికీ ప్రదర్శించబడే నాటిక...

విచిత్రమైన ప్రశ్నలతో స్త్రీ వైపునుంచి తిరుగుబాటు. ఇంత వాదన, ఏనాటినుంచో వస్తున్న సాంప్రదాయాలను ప్రశ్నించి, ఎదిరించగలగడం. అతి అనురక్తి, అనురాగం... ప్రేమికురాల్లో సహజంగా ఉండాలనుకునే వినయం, వందనం తప్ప దర్శించలేని మొగవాడిని – చిత్ర– తనప్రేమ తీవ్రతతో ఉన్నతుడుగా ఆలోచించి, స్పందించి, ఎదిగేట్లు చేస్తుంది. ఇది ఆశ్చర్యకరమైన మార్పు.

తనకు ఏమి కావాలో, దానికి అనుగుణంగా స్త్రీ ఎలా ఉండాలో మాత్రమే చూడగలిగిన పురుషసామ్రాట్టు అతడు – కానీ, అతణ్ణి తన నిజమైన స్వభావాన్ని, ప్రవర్తనను గుర్తించమనడం, గౌరవించేట్లు చేసుకోవడానికి ఒక జీవిత కాలపు తపస్సు– ఎంతో భావోద్వేగంతో జ్వలిస్తారు ఠాగూర్. కానీ పురుషుడేగా... ఈ విషయం, స్త్రీత్వంలో ఈ లోతు, ఈ ఛాయ, ఈ స్థాయీభావన గ్రహించడానికి ఎంత మధన, తీవ్రత, ఆరాధనతో కూడిన అక్షర తపస్సు చేశాడా ఆయన?! అనిపిస్తుంది.

సత్యానికి తొలిరూపం భ్రాంతి...మరొక్కసారి పుస్తకాల భాండాగారంలో వెతుక్కుని చిత్రను చదివిస్తుంది మైథిలి.

కానీ, మైథిలీ వ్యాఖ్యానంతో కానీ చిత్ర, రవీంద్రులు- ఇద్దరు అర్థం కారేమో అనిపిస్తుంది.

(అమెరికాలో ఒక అమ్మాయికి చిత్రగురించి చెబితే, ఎవరో రాసిన సినాప్సిస్ ఇంగ్లీషులో చదివి "ఇదేమిటి మాడం... ఈ ఆడా మొగా కాని కారెక్టర్" అన్నది... నేను మైథిలి వ్యాఖ్యానం అక్కడక్కడ ఫోన్లో చదివితే ఈ చిత్రకు, కనబడని చిత్రకు ఆరాధకురాలైపోయింది ఆ పిల్ల).

రసజ్ఞుడు, పురుషసింహము అయిన అర్జునుడికి, వీరత్వం, ధైర్యం రక్షణ ఇచ్చే చిత్ర ప్రేమ ఆనదు...ఆమె మన్మథుడిని ప్రార్థించి, తనకు ఇష్టం లేకపోయినా, తను కాని తనుగా మారి స్త్రీగా, పురుషుడు కోరుకునే అబలగా, ఆరాధకురాలిగా, ఆధారపడే లతగా అతనికి లొంగిపోతుంది. కానీ, గమ్మత్తు ఏమిటంటే, మహావీరుడు, కర్తవ్యనిష్టుడు అయిన అర్జునుడికి ప్రేమ, శృంగారము తప్ప మరేమీ లేని ఈ జీవితము అతనికి చాలటం లేదు.. అతనిలోని నిజ ప్రకృతి నిద్రలేస్తే కానీ, ఈమెలో మూలప్రకృతిలోని ఆకర్షణ, వైవిధ్యమైన ఆకర్షణ అర్థం కాదు.

చిత్రను అర్థమయ్యేట్లు చిత్రీకరించింది మైథిలి.

**ఇంక జలంధర గురించి**

శరత్ జ్యోత్స్నలో ఆదమరచి భావుకతతో అవతలి తీరాలను సృజిస్తున్న అమ్మను స్పర్శతో తన లోకాలకు తెచ్చుకుని ఆ ఆశ్చర్యాభినివేశాన్ని సెల్ఫీ తీసి చూపిస్తూ కిలకిలా నవ్వే పాపను చూసిన అనుభూతి అది...మాటలకు, అక్షరాలకు ఇమడనిది... అంద నిది...నేనుగా రాయలేనిది.

**కలల ఇంటి చిరునామా కృష్ణశాస్త్రి**

ఇది చదవగానే...మన ఊహల్లో కృష్ణశాస్త్రిగారు, మరొకసారి శాంతంగా, హాయిగా, వాత్సల్యంతో నవ్వుతారు.

నువ్వు లేనిది బ్రతకలేను - నీతో బ్రతకలేను - అని మా నాన్నగారు (డాక్టర్ గాలి బాలసుందరరావుగారు) ఎవరి ప్రేమగురించో విశ్లేషిస్తూంటే...దానికి మూలము "నిను కానక నిముసము మనలేను...నువ్వు కనబడితే నిను కనలేను..." అన్న కృష్ణ శాస్త్రిగారి థాట్‌కు ఎక్స్‌టెన్షన్ అని మైథిలి వ్యాఖ్యానం చదివితే కానీ అర్థంకాలేదు.

"నావలె అతడున్మత్త భావమయశాలి. ఆగికొనలేడు రేగు ఊహలనొకింత.. ఇంత చిరు గీతి ఎద వేగిరించునేని పాడుకొనును... తాండవనృత్యమాడుకొనును..."

"ఈ మాటలు ఇంచు మించు నా జీవితపు టాగ్ లైన్లుగా ఉండేవి"- అని మైథిలి అనగానే, ఎంత రసపిచ్చి, ఈ విశ్లేషణలను రాయించిందో మనకు నిర్మోహ దర్పణంలో నీరెండ ప్రతిఫలించినట్లు అర్థమైపోతుంది...

కరుణతో దు:ఖించే ఉన్నతుడి గురించి చెప్తూ కృష్ణశాస్త్రిగారు "అతడు తెలిసిపోతాడు. అతని వద్ద చెప్పులు వదిలి తలదించుకుంటాము" అంటారు.

మంత్రపుగవాక్షాలగురించి, ప్రమాదభరిత సాగరాలగురించీ పదచిత్రాల గురించి, అక్షరానికుండే జిలుగు, వాక్యానికుండే గంభీర రస శృంగారం...రాత్రి కన్న, మృత్యువు కన్న నల్లని అన్యాయాలను సహించడం...ఇవి అనుభవరాహిత్యం ఉంటే అర్థం కావు మరి...

లోకానికి పొలిమేరన నీలోకం నిలుపుకో...అక్కడే ఎందుకు ఇలా కృష్ణశాస్త్రిగారు స్వస్థత పొందారో, ఆ అనిశ్చలతలో అయనకు ఎందుకు Permanancy కనబడిందో?!

**దారి తోడూ దీపస్థంభమూ**

చలంగారి 'పురూరవ' రేడియోలో విని, ఆ మాదకతతో గంధర్వలోకాల్ని దర్శించి, ఊదారంగు మునిమాపు వేళ 'మ్యూజింగ్స్' చదివి, మీటనొక్కితే వెలిగిన బంగారపు కాంతి– మంత్రపు కిటికీల కావల మాధుర్యపు కడలి అలలు– అర్థం చేసుకుని, మనకు మళ్లీ చలంను చదవాలన్న ఆదుర్దా కలిగేట్లు చేశారు మైథిలి.

**కౌమారపు పూలతోటలో**

"నీ అడుగులు ఎక్కడ పడుతున్నాయో గమనిస్తావు కదూ!" అని సీక్రెట్‌గార్డెన్ టీనేజ్ పిల్లలకు బహుమతిగా ఇస్తూ "చాలా ఇచ్చాను" అని అర్థమైంది అనుకుంటుంది మైథిలి. ఈ వ్యాసం ప్రత్యేకత ఏమిటంటే... ఏ పుస్తకాలు పిల్లలు చదవకూడదో మనకు బాగా అర్థమయ్యేట్లు ఏ పుస్తకాలు చదివించాలో తెలియని అయోమయానికి పరిష్కారంగా కొన్ని పుస్తకాల లిస్ట్ ఇచ్చారు మైథిలి.

**చదివినవి – కొన్ని**

చదివిన ప్రతి మంచి మాటకూ, మైథిలి స్పందించడం కనిపిస్తుంది మనకు.

కర్ణుడి దాడి సూదుల్లాంటి మాటలకు కోపంతో వణికి పోతూ అతని పాదాల్ని చూసినప్పుడు మాత్రం అచ్చు మాతృమూర్తి కుంతి పాదాలు ఎందుకు స్ఫురిస్తాయో, ఎందుకు వందనీయమనిపిస్తాయో....

గతించిన వారికి శ్రాద్ధ విధులు పెట్టేటప్పుడు కుంతి చెప్పిన పరమరహస్యం విని కదిలిపోయే ధర్మరాజు – భారతంలో శాంతిపర్వంలో ఔన్నత్యం... మమత శీర్షిక కింద చిత్రీకరిస్తారు మైథిలి.

**గోరా**

"పిడివాదం ఒద్దు...దానివలన ఎంత మంచి సిద్ధాంతానికైనా మాలిన్యం అంటు తుంది. వైయక్తికమైన సంస్కారం శ్రద్ధతో కూడిన జిజ్ఞాస ఉంటే చాలు, అదే కనిపిస్తుంది.

మైథిలి మాటల్లో మరొకసారి గోరాను, వంశవృక్ష నవలను ప్రభావితము చేసిన ఋషితుల్యాలు, కావ్యనిర్మాత రవీంద్రులు సృష్టించిన 'గోరా'ను చదువుతాము.

(ఇలా ఆలోచించే మైథిలికి కన్యాశుల్కం ఎందుకు నచ్చలేదో?!)

### కుటుంబరావుగారు

తనకు నచ్చిన రచయితల్లో కుటుంబరావుగారి గురించి మైథిలి చెప్పింది చదువుతూంటే.. మనం ఇలాగే ఆలోచించాలి– అన్న కంపల్షన్ ఏదో... కదిలిస్తుంది.

“ఒక పిల్లకు తగిన మొగుళ్లు కనీసం నలుగురు ఐదుగురు ఉంటారు”.

“అవతలి వాళ్లు తప్పులు చేస్తూంటే కదా మనం తిట్టుకోగల అవకాశం వస్తుంది!”

“ఈ రచయిత నిరర్థకరమనుకునే వాటిల్లో మెలోడ్రామా ఒకటి...”

ఇప్పటికే మనం పుస్తకాల బీరువాల్లో కుటుంబరావుగారి కోసరం వెతికేసు కుంటాము.

### ‘అవతలిగట్టు’

అరవిందగారి ‘అవతలిగట్టు’ విశ్లేషిస్తూ – చిరకాలం జ్ఞాపకం ఉంచుకుని, నిత్యం స్మరణగా, ఓదార్పుగా, కర్తవ్యంగా తోచేమాటలు– గైడ్‌లైన్స్ రాశారు మైథిలి.

“యుద్ధంలో సర్వతో భద్రవ్యూహం ఏదీ ఉండదు. కానీ, ఎడా పెడా తగలగల దెబ్బల్ని కళ్లు తెరిచి కాచుకోవడం ఒక మెలుకువ. తగిలితే ఓర్చుకోవడం ఒక సత్తువ. అన్నింటినీ అవతల ఆపి కంచెకు ఇవతల విడిది చెయ్యడం సాధన. ఇది ఎవరికి వారు చేసుకోవలసిన మేలు”

ఈ పుస్తకం ఆ సాధనకు అర్థం చెపుతుంది. “తాను కాలేని దేన్నో శారద లీలలో గుర్తుపడుతుంది ఆమె – లీల, నిబ్బరించుకోగలదు. క్షమించగలదు. ప్రేమించడం మానెయ్యకుండా ఉండగలదు”– అవతలిగట్టును ఇవతలినుంచే చూపిస్తారు మైథిలి.

### మాలతీ చందూర్

వీరి గురించి రెండు మంచి వ్యాసాలు ఉన్నాయి.

ఇంగిత జ్ఞానానికి పట్టం కట్టిన రచయిత్రి మాలతీ చందూర్ గారు. ఎదిరించడం గురించి ఎంత చెప్పారో, ఇమిడిపోవడం గురించీ అంతే చెప్పారు...ఆమెది ఆరోగ్య కరమైన సాహిత్యం అంటారు మైథిలి.

### మునిపల్లె రాజుగారు

ఈ రచయిత గురించి చెబుతూ సవితి తమ్ముడి కథ నా ఆల్ టైం ఫేవరెట్ అంటారు మైథిలి.

భారతీయ పూర్వకార్యమర్యాద...ఆశతో ముగించడం – ఆనందాన్ని సూచించడం – అంటూ జీవనంతో పొంగిపొరలే నదీనదాలవంటి రాజుగారి కథలకు – “మాజిక్ రియలిజం కథలు” కొత్త అందాల్ని పనిగట్టుకుని ఏమీ తెచ్చిపెట్టలేదు అంటారు.

### ఆచంట జానకీరాం

రమ్యతర స్మృతిలో ఆచంట జానకీరాం గారి గురించి జాజిపువ్వుల అత్తరు దీపం – టాగూర్‌తో పోల్చదగిన కథలు రాసిన ఆచంట శారదాదేవిగారు ఈయనకు మనకు తెలిసిన ఆయన భార్య...చలంగారు ఎల్లెపెద్ది శారదగా ఈమెను గురించి

ప్రస్తావించారు...ఆయన సౌందర్యోపాసన, స్వాప్నికతల గురించి వింటే... చాలా అర్థమౌతుంది మనకు.

**ఇచ్ఛాపురపు జగన్నాథరావుగారు**

వీరి వాక్యాలు చిత్రిక పట్టినట్లుంటాయి... వలపు, మమత, వర్షం... వీటిగురించి చాలా చెప్పారు.

భార్యలో ఎన్నో లోపాలు, తెలివితక్కువతనాలు చూసే భర్తకి మరొక అమ్మాయి... (బహుశ చాలా మంది మెచ్చుకునే అమ్మాయి) అసలు ఏ కదలికా సహజంగా ఉండని అమ్మాయిని చూసి "తనే నయం (భార్య) కనీసం ఫ్రిజ్‌లోనించి తీసినట్లు ఉండదు..." అంటారు రచయిత. ఇప్పటికే ఆయన చాలా అర్థమైపోతారు.

**యాత్ర**

కృష్ణగారి యాత్ర...తనను ఆరాధించే ప్రభును అనేక సంఘర్షణల తరువాత ఆఖరికి అంగీకరిస్తుంది మీర...అయితే ఆ ముగింపులోనూ దు:ఖపు జీర...ఇందుకని చెప్పలేము...

నిజం, 'యాత్ర' చదివితే అదే అనిపిస్తుంది.

**రైలుబండి**

టెట్సూకో కురోయనాగి అనే జపనీస్ మహిళ Tolto Chan-The litle girl at the window- అనువాదం...ఎన్నోసార్లు చదివించి ఆలోచింప చేసే పుస్తకం.

జపాన్‌లో కర్కశ పరిపాలనలో రైలుబండి మాత్రం ఒక రక్షితారణ్యం... ఇస్సాకొబయాషి బడి – దాన్ని గురించి చదివితే మనకు కూడా ఆ బడిలో చదువు కోవాలనిపిస్తుంది. ప్రపంచం పట్ల నమ్మకం కోల్పోకుండా ఉండేందుకు తప్పకుండా చదవవలసిన పుస్తకం ఇది.

**'మీనా'**

యద్దనపూడి సులోచనారాణిగారి 'మీనా' గురించి చెప్తూ ఈ రోజు ఆ పుస్తకం మళ్లీ కనబడ్డా ఆప్యాయంగా చదువుకోగలను...ఏ రోజుల్లో ఏ పుస్తకాలు చదివానో, ఆరోజు వాన పడిందో లేదో... అన్నీ అక్షరజ్ఞాపకాలే– అనే ఈ పాఠకురాలైన రచయిత్రికి విశ్లేషించే సాధికారత ఉన్నది మరి.

మీనా తండ్రి మీనాను "మంచి ఇల్లాలుగా తప్ప మరెందుకూ పనికి రాదు" – ఒక మగవాడిగా తన బిడ్డను ప్రేమించి, సునిశితంగా పరిశీలించిన ఈ మాటలు – "నువ్వు ఏం చేద్దామనుకుంటున్నావు?" ప్రతి ఆడపిల్లనూ అడిగే మనం– ఏదో నువ్వు చేసి చూపించాలి– తప్పదు – అన్న కంపల్షన్ ఉన్న ఈ కాలంలో..

తను ఏమీ కానక్కర్లేదు...తనకు తాను ఉంటేచాలు – అనేదేమిటో హృద్యమంగా చూపించారు రచయిత్రి. ఆ విషయం ఎంత అపురూపమో అర్థమై..."మళ్లీ మరొకసారి 'మీనా' చదవాలి" అనిపించేస్తాయి ఈ అక్షరాలు.

## మరల సేద్యానికి

శివరామకారంత్... తిరుమల రామచంద్రగారి అనువాదం ఇది. "పుస్తకం ముగించిన ప్రతిసారీ కొత్తగా స్వస్థత వస్తూ వుంటుంది నాకు.. జీవితంపట్ల, తోటివారిపట్ల విశ్వాసాన్ని గట్టి చేసే రచనలకు నేను నమస్కరిస్తాను...నా పూజాపీఠం మీద ఉండే పుస్తకాలలో ఇది ఒకటి..." అంటారు మైథిలి.

ఈ నవలగురించి ఇవ్వాళ నేను రాసే ఈ కాసిని మాటలు నాకు సరిపోవు, అందుకు మీరు చదవడం ఒకటే మార్గం... అని శాసిస్తారు.

## మార్క్‌ట్వేన్ - రాజు పేద

నూటికి నూటయాభైపాళ్లు అమెరికన్ అయిన మార్క్‌ట్వేన్ ఆనాటి ఇంగ్లాండ్ మీద మహా పదునుగా గురిపెట్టిన అస్త్రం ఈ నవల.

మురికివాడలో పెరిగిన 'పేద' కుఱ్ఱాడు "ఒక్కొక్కరికి రెండు జతల బట్టలు ఎందుకు మహారాజా! వాళ్లకు ఒక్కొక్కళ్లకు రెండు శరీరాలు లేవుగా"– అనేటంతటి దారిద్ర్యం, రాచముద్రికను బాదంకాయ కొట్టే రాయనుకోవడం– (అది అందుకు తప్ప పనికిరాదేమోనన్న వెటకారం) గొప్పగా చదివించి – చాలా జీవిత సత్యాలు చెప్పి బలవంతంగా మన కళ్లు తెరిపించే ఈ నవల గురించి...

చరిత్ర అవసరం.. దాన్ని స్పష్టం చేసేందుకు Historical fiction అవసరం... The world is made wrong.. Kings should go to schools to their own laws at times and so learn mercy - అన్న మార్క్‌ట్వేన్ అక్షరాలు మనం ఎన్ని నేర్చుకోవాలో అని చెప్తారు మైథిలి.

## అయినవీ - కానివీ

ఈ శీర్షిక కింద రచయిత్రి కొన్ని వాక్యాలు – మన్నింపదగ్గవి రాశారు.

ఇప్పుడు గడిచిన కొన్ని ఏళ్లుగా శాంతం తప్ప కోరదగినది ఏదీ లేదనిపిస్తోంది.

అది ఏదీ పట్టకపోవడం కాదు – తెరవెనక ఏదోముందే కనిపించడం అనిపిస్తుంది.

ఒక సౌందర్యాన్ని కలిసి దర్శించడానికి ఎందరి తోడో ఉంటే అంత ఆనందం అనే తెలివిడి...అని ఫేస్‌బుక్‌లో సాహితీమిత్రుల గురించి అన్నప్పుడు సోషల్ మీడియా మీద గౌరవం పెరుగుతుంది.. ఒక రకంగా ఇంటర్నెట్ మ్యాగ్జైన్, ఫేస్‌బుక్. మంచి పాఠకురాల్ని, సాహిత్యాన్ని వెఱ్ఱిగా, పిచ్చిగా ప్రేమించే నేను వృత్తిరీత్యా డాక్టర్ను మాత్రమే అనుకున్న మైథిల్ని మనకు మంచి రచయిత్రిగా పరిచయం చేసిన గౌరవం ఈ రెండు మీడియాలదే. సాహిత్య ప్రయోజనం అంటూ ఉంటే అది రక్షించడం అని నేను నమ్ముతాను.

నా వరకు నాకు రచయితకు పాత్రలమీద కొంత అయినా 'కరుణ' ఉండాలి.. లోపాలు గుర్తిస్తూనే అవి ఏర్పడ్డానికిగల కారణాలపట్ల సానుభూతి ఉండాలి...అన్న

మైథిలికి రచయిత్రి, మంచి రచయిత్రి అవడానికి పూర్తి అర్హత ఉన్నది అనిపిస్తుంది.

**కొంచెం విచ్చిన కిటికీలోనించి**

ఈ విభాగంలో వర్డ్స్‌వర్త్ గురించి చెబుతూ ప్రకృతిలోని లయతో కలిసినప్పుడు వచ్చే శాంతాన్ని (ముక్తి కోసరం కాకుండా) వాస్తవ జీవితంలోకి తెచ్చుకోవడాన్ని వర్డ్స్‌వర్త్ మాత్రమే చెప్పగలిగారు అని తన అబ్సర్వేషన్ చెప్పారు రచయిత్రి.

షెల్లీ గురించి దైవస్తుతి లాంటి "Hymn" గురించి చెబుతూ అదృశ్యమైన ఒక శక్తి తాటాకునీడ ఏదో మనుష్యలోకాన్ని ఆవరించి ఉన్నది. వసంతపు గాలులలో, వెన్నెల కిరణాలలో సంగీతం విన్న స్మృతిలో సాక్షాత్కరించే అనుభూతి, ఆశ, అనురాగం... వీడిపోయినప్పుడు నీరవము, కావేషము.. ఇలా అర్థం చెప్తారు.

ఎల్.ఎమ్.మాంటిగోమారి సమాధి సందర్శనంలో (చూడకుండానే) "భౌతిక శరీరంలో వెళ్లేదే సమస్తం అవ్వఖర్లేదు" అంటూ అంత:చక్షువుల దర్శనం గురించి చెప్తారు. పి.డి.ఉడ్‌హౌస్ గురించి...చెబుతూ "అన్నీ హాస్యంగా కొనసాగి సుఖంగా ముగుస్తాయి.." అంటారు.

1963 లో ఒక డేనిష్ రచయిత్రి Ann Holm పిల్లల కోసరం రాసిన నవల – I AM DAVID - కాన్సన్‌ట్రేషన్ కాంపులో అనుభవాలు...అక్కడి నుంచి తప్పించుకుని డెన్మార్క్ చేరిన ఒక పన్నెండేళ్ల పిల్లాడి కథ ఇది.

_ 'HOME BURIAL' BY ROBERT FROST

ఆప్తులను పోగొట్టుకున్న దు:ఖం కలిగించే దిగులు ఏ ఇద్దరిదీ ఒక్కలాగా వుండదు...నిజం.

దారుణమైన కమ్యూనికేషన్ గాప్ – దీన్ని గురించి ఇంత తక్కువ మాటల్లో చెప్పడం కష్టం.

"ఆమె చూడనిచ్చింది అతణ్ణి...గుడ్డివాడిని..." ఈ ఒక్కవాక్యం చాలు కావ్యాలు రాయించడానికి మళ్లీ మళ్లీ చదవాలనిపిస్తుంది...అంటారు.

**ఎవరిని నిర్ణయించేది?**

Cauldstane నవలలో రచయిత్రి Linda Grillard-Thirdman Syndrome అనుభవంలోకి తీసుకువస్తారు.

ఇద్దరి మధ్య మరెవరో ఉన్నట్లు... సత్యం శంకర మంచిగారి అమరావతి కథలలో నావెనక ఎవరో? కథలోలాగా...ఈ అనిపించడం అప్పుడప్పుడు మన అందరికీ అనుభవమే.

**మంత్రపుష్పాలు**

రచయిత్రి తన కుటుంబంతో కలిసి చేసిన పిక్నిక్‌లాంటి ప్రకృతియాత్రలో "వెండి మెరుపు ఎండ కింద, శ్వేతస్నిగ్ధ ప్రవంతుల మధ్యన, కమ్మేసిన సౌరభాల లోపల, బయట అత్తరు దివ్వెలయిపోయాము...తామరపూవుల అత్తరు...అంటారు. ఈ

భావుకురాలు...జీవితాల్లో చిన్న చిన్న అనుభవాలను, అనుబంధాలను గుండెలో ఫ్రేం కట్టి దాచుకున్న అదృష్టవంతురాలు... తలుచుకున్నప్పుడల్లా పులకించిపోగలిగిన భాగ్యశాలి.

ఆ! ఎప్పుడో జరిగిన సంగతులు..ఇప్పుడు ఏం గుర్తువుంటాయి? అని వట్టిపోయిన భావావేదనలో...రాయాల్సి వచ్చినప్పుడు కృతకంగా గుండెల్ని పిండి అక్షరాలు బొట్టుబొట్టుగా పట్టుకునే దురదృష్టం పట్టని అక్షరపూజారిణి.

ఈ విభాగంలో మొత్తం రచయిత్రి భావోద్వేగం, సంగీతం, ప్రకృతి– ఈ మూడింటిలో స్పందించే నిశ్శబ్దపు లయను మనకు అయాచితంగా కానుకగా ఇస్తారు.

ఇక్కడ శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారిని మనకు మరొక్కసారి రజనిగారు 'వర్ధిల్లుతున్న మధువన స్వప్నం' అంటారు.

**ఈ లోకపు పొలిమేరలు**

చౌడయ్యగారి హాలులో ప్రభా అత్రే సంగీతాన్ని మరిపించిన ఒక దంపతుల జుగల్‌బందీ.

"జన్మించినప్పటినుంచీ ఎరిగి వుండనట్లుగా, జన్మ ఎత్తింది అందుకేనన్నట్లుగా మా అంత:స్తంత్రువులు కంపించిపోయినాయి"

ప్రేమించుకున్న ఇద్దరు ఆ ఇష్టాన్ని పక్కపక్కనే కూర్చుని చెప్పుకోవడంలో సౌందర్యం ఎంత ఉంటుందో?! ఆ సంభాషణ సంగీతం అయితే?! లోకోత్తర అనుభవం...అంటూ తన అక్షరఝరిలో ఆ అందాన్ని నిశ్శబ్దంగా ఆశీర్వదించమంటారు.

**రాగం నీలాంబరి గురించి చెబుతూ...**

శంకరాభరణం రాగం ఎంతో విస్తృతమైన అద్భుతం.

నగారా మోగించే ఆరభి, నర్తించే అఠాణా, ఉత్సాహసంరంభం బేహాగ్... ఎగసి మోకరిల్లే నమస్సు బిలహరి... ఉత్సవమయ్యే హంసధ్వని... కదన కుతూహలం...

వీటన్నిటితోపాటు జోకొట్టే నీలాంబరి అందులోనించే పుట్టింది.

అమ్మ కూనిరాగంలో వినబడే ఆత్మీయతకు ఆడంబరం కావాలా?!

"కుఱై ఒంఱ్రుం ఇల్లై" అన్న తమిళ గీతం గురించి ఒక గొప్ప సత్యం చెప్పారు రచయిత్రి. ఆ పాట అద్భుతత్వం వలన, గొప్ప పాప్యులారిటీ వల్ల దాన్ని రాయించిన ఇన్స్పిరేషన్ ఏమిటో?! అని ఎప్పుడూ ఆలోచించలేదు. ఆపాట శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారిగారు రాశారు. 1925 ప్రాంతంలో అప్పట్లో ఆలయప్రవేశం నిరాకరించబడిన ఒక దళితుడి ప్రేరణతో ఈ అద్భుతాన్ని రచించారట.

"అతను నిన్ను చూడలేదు. చూసిన నేను మాత్రం నిన్ను తెలుసుకున్నానా?!" అనిపించిందట ఆయనకు.

ఎరుగని వారికి ఎదలో ఉన్నాడు... ఎరిగినవారికి ఎదటే ఉన్నాడు... అంటే ఇదేనా?!

అమృతవర్షిణి నిండిన హృదయంలోనించి వచ్చే స్తోత్రంలా...అర్చనలా వినిపిస్తుంది.

ముత్తుస్వామి దీక్షితులు వారు రాసిన "ఆనందామృతవర్షిణీ" రచన వెనకాల హృద్యమైన కథ, సింధుభైరవి రాగాల సౌందర్యాన్ని, ఝురిని వింటాము.

ఇక్కడ శ్రీరంగం గోపాలరత్నం గారి గొంతు గురించి చెపుతూ, "మధ్యాహ్నం కోసి మాలకట్టి తడిబట్టలో చుట్టిన మల్లెపూలను సాయంకాలం చల్లబడిన వేళ.. ముఖానికి అద్దుకున్నట్లు ఉంటుంది..."

ఈ అనుభవం మనకు ఉన్నదో, లేదో... ఊహ స్వాంతన కలిగిస్తుంది.

మరొకసారి మన మనస్సులో ఆవిడగారు, మంగళంపల్లిగారూ కలిసిపాడిన ఘనశ్యామ సుందరా... శ్రీధరా...పారిజాతాలు పరిఢవిల్లినట్లు...వంశీ మోహనుడి గానం. ఆ పూవులు వైకుంఠ పురపు పెరటితోటవి. అతడి... శ్రీపాదోద్భవి... గంగది.

ఇలా ఎన్ని రాశారో...ఎన్ని ఆనందరాగాలో పేజీలు తిప్పితే...మీకూ వినిపిస్తుంది ఈ స్వరార్చన.

**విశ్వనాథ**

విశ్వనాథ గురించి... కొంచెం సమయం దాటిన తరువాత...చాలా సమయాన్ని వెచ్చించి చాలా నేర్చుకున్నాను అన్నారు మైథిలి. అంతేకాదు... మనకు చాలా వెలుతురు కోణాలనుంచి ఆ హిమాలయ సదృశ ఉత్తీర్ణ గంభీర అక్షర అరుణాచలేశ్వరుడుని చూపించినట్లు చూపిస్తారు.

ఆయన పట్ల ఆరాధన, భక్తిభావం, ఆయనలోని విశ్వకవి విరాట్ స్వరూపం...ఈ వ్యాసంలో దర్శనమిస్తుంది.

విశ్వనాథగారి గురించి ఏమి తెలియకపోయినా, బోలెడు తెలిసినా కూడా చదివి నేర్చుకోవలసింది చాలా ఉన్నది అన్న భావంతో చదివిస్తాయి.

(విశ్వనాథ వారి సాహిత్యాన్ని విశ్లేషిస్తూ సులభతరం చేసి ఈ తరం వారికి ఆయనలో విజ్ఞానిని, దార్శనికుణ్ణి, మంత్రశాస్త్రవేత్తను, ఉపాసకుడిని, చరిత్రకారుణ్ణి, ద్రష్టను, కథకుణ్ణి పరిచయం చెయ్యమన్నదే నా కోరిక... ఈ మధ్య మైథిలి ఫేస్‌బుక్‌లో ఆయన రచనను సులభతరం చేసి అందులో ఏముందో, ఎంత విషయముందో రుచి చూపించింది).

తీవ్రమైన గాఢాను గాఢమైన అనురక్తి ఎలా ఉంటుందో బొమ్మకడుతూనే రాని అచ్చుపుదన మెంతటిదయినా...దేశకాలపరిస్థితుల రీత్యా... ఒక హద్దును అతిక్రమించినప్పుడు... అవతలివారు స్పందించనప్పుడు ఆ ఉద్వేగాన్ని ఆమోదయోగ్యం చేయలేరని... చెప్తూ అసాధారణ లోకజ్ఞతా, అమితమైన మృదుత్వం – రెండూ సమంగావున్న సాహిత్యకారులకు మాత్రమే సాధ్యమయ్యేది ఇది...అని విశ్వనాథకు నిర్వచన హారతి పడతారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nimagna**

* * *